కేసీఆర్‌ను కలిసిన వర్గల్ నాయకులు



కేసీఆర్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న నాయకులు

వర్గల్, ఫిబ్రవరి 7: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను శుక్రవారం ఎర్రవల్లి ఫాంహౌస్‌లో వర్గల్ మండలానికి చెందిన బీఆర్ఎస్ అధ్యక్షుడు వేలూరి వెంకట్‌రెడ్డి, పార్టీ జిల్లా యూత్ అధ్యక్షుడు దేవగణిక నాగరాజు, మాజీ జడ్పీటీసీ బాల మల్లుయాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వర్గల్‌లో ఈనెల 11న ప్రతిష్ఠించనున్న భ్రమరాంబిక కేతమ్మ సమేత మల్లికార్జునస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనకు రావాలని ఆహ్వాన పత్రిక అందజేశారు.

మురుగును తొలిగించిన పారిశుధ్య సిబ్బంది

జెట్టింగ్ మిషన్ సాయంతో చాంబర్‌ను క్లినింగ్ చేస్తున్న సిబ్బంది

గజ్వేల్, ఫిబ్రవరి 7: ఈనెల 6న గురువారం 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో 'మురుగు-పరుగు' శీర్షికన ప్రచురితమైన వార్తా కథనానికి గజ్వేల్ మున్సిపల్ అధికారులు స్పందించారు. శుక్రవారం పట్టణంలోని ఎయిర్‌టెల్ టవర్ కాలనీలో చాంబర్లరు జెట్టింగ్ మిషన్ సాయంతో క్లీనింగ్ చేశారు. నాలుగు రోజులుగా ఆయా వార్డుల్లో యూజీడీ చాంబర్ల ద్వారా మురుగునీరు బయటకు వస్తుండడంతో పట్టణ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతుండడంతో అధికారుల స్పందించి చాంబర్లను క్లీనింగ్ చేయించారు. కార్యక్రమంలో కమిషనర్ గోల్కొండ నర్సయ్య, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలి

- కలెక్టర్ మనుచౌదరి

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మనుచౌదరి, అధికారులు

సిద్దిపేట, ఫిబ్రవరి 7: ఒకటి నుంచి 19 ఏండ్ల లోపు పిల్లల్లో నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవ అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈనెల 10న సిద్దిపేట జిల్లాలో నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. జిల్లాలో 2 లక్షల 42 వేల మంది చిన్నారులు ఉన్నారని, వారికి ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయాలన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో, ఆరోగ్య కేంద్రాల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో, కళాశాలల్లో ఆల్బెండజోల్ మాత్రలు వేయాలన్నారు. కార్యక్రమం విజయవంతంలో వైద్యారోగ్య శాఖతో పాటు ఐసీడీఎస్, విద్యాశాఖ, మున్సిపల్, పంచాయతీ రాజ్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ పల్వన్ కుమార్, ఏవో నవీన్ రాజ్‌కుమార్, శ్రావణి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రణాళిక ప్రకారమే కుల గణన సర్వే

- మంత్రి పొన్నం ప్రభాకర్

మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, ఫిబ్రవరి 7: ప్రణాళిక ప్రకారమే కులగణన సర్వే జరిగిందని బీసీ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం హుస్నాబాద్‌లోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోనే తెలంగాణ ప్రభుత్వం మార్గదర్శకంగా ఉండేలా కులగణన సర్వే చేసిందన్నారు. రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్రలో ఇచ్చిన మాట ప్రకారం ఆంగ్లేయుల కాలంలో జరిగిన కుల సర్వేను తిరిగి నేడు కాంగ్రెస్ సర్కార్ చేయించిందన్నారు. క్షేత్రస్థాయిలో పకడ్బందీగా లక్షమంది ప్రభుత్వ ఉద్యోగులతో సర్వే చేయించామన్నారు. అధికారులు కోటి 12 లక్షల ఇండ్లు తిరిగి సర్వే చేశారన్నారు. బీజేపీ బీసీని ముఖ్యమంత్రి చేస్తుందా అని ప్రశ్నించారు. శాసనసభ పక్ష నాయకుడిని రెడ్డిని చేశారని ఎద్దేవా చేశారు. దేశంలో మతం పేరుతో విద్వేషాలు సృష్టిస్తూ ఓట్ల రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. బలహీన వర్గాల గురించి మాట్లాడే అర్హత బీజేపీకి లేదన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య తదితరులుల ఉన్నారు.

రక్తదాన శిబిరం

శిబిరంలో రక్తం ఇస్తున్న రక్తదాతలు

కొండపాక (కుకునూరుపల్లి), ఫిబ్రవరి 7: కొండపాక మండలం దుద్దెడ శివారులోని శ్రీకృప ఫార్మసీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ యూనిట్, లియో క్లబ్ స్ఫూర్తి ఆధ్వర్యంలో మిత్ర బ్లడ్ సెంటర్ సహకారంతో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 40 మంది రక్తదానం చేశారు. మిత్ర బ్లడ్ సెంటర్ చైర్మన్ సత్యం మాట్లాడుతూ సరైన సమయంలో రక్తం లభించక చాలామంది చనిపోతున్నారని, రక్తదానం చేయడం వల్ల ఎంతోమంది ప్రాణాలు కాపాడినవారవుతారన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ మల్లారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ మంజునాథ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్సీవోకు ఫిర్యాదు

ఆర్సీవో కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న విద్యార్థి సేన నాయకులు

హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 7: మండలంలోని జిల్లెలగడ్డ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజనం, పాఠశాలలో విద్యార్థుల సెల్‌ఫోన్ల వాడకం, ప్రిన్సిపాల్ పనితీరుపై సేవాలాల్ విద్యార్థి సేన నాయకులు శుక్రవారం హన్మకొండ ఆర్సీవోకు ఫిర్యాదు చేశారు. పాఠశాల నిర్వహణ సరిగా లేకపోవడంతో విద్యార్థుల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఫుడ్ సప్లై కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. కాంట్రాక్టర్ సప్లైని రద్దు చేయాలని ఫిర్యాదులో వారు పేర్కొన్నారు. వారిపై చర్యలు తీసుకోకుంటే పట్టణంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సేవాలాల్ సేన సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు కునుసోతు మురళీనాయక్, గుగులోతు సంతోశ్ నాయక్, రామకృష్ణ నాయక్, సుమన్ నాయక్, ప్రవీణ్ నాయక్, వెంకట్ నాయక్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో చదువుకోవాలి

మాట్లాడుతున్న ఎస్ఐ విజయభాస్కర్

అక్కన్నపేట, ఫిబ్రవరి 7: విద్యార్థులు లక్ష్యంతో చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అక్కన్నపేట ఎస్ఐ విజయభాస్కర్ అన్నారు. శుక్రవారం మండలంలోని కట్కూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు రక్షణ చట్టాలు, సైబర్ నేరాలు, గుడ్ టచ్- బ్యాడ్ టచ్, గంజాయి, ఇతర మత్తు పదార్థాలు, ఈవ్‌టీజింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ..విద్యార్థులు చదువుకునే సమయంలో ఎలాంటి చెడు వ్యసనాలకు లోను కావొద్దన్నారు. కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకొని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కలిగి, ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ నేరాల బారిన ఎవరైనా పడితే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే ఎలాంటి వివరాలు చెప్పకూడదన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రఘు, షీటీమ్ బృందం సదయ్య, ప్రశాంతి, కృష్ణ ఉన్నారు.

ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండాను ఎగురవేయాలి

- మాజీ ఎంపీపీ మేడిశెట్టి శ్రీధర్

చేర్యాల: వీరన్నపేటలో మాట్లాడుతున్న మేడిశెట్టి శ్రీధర్



మద్దూరు: లద్నూర్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

చేర్యాల, ఫిబ్రవరి 7: రానున్న సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా ఎగురవేసేందుకు గులాబీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని బీఆర్ఎస్ క్లస్టర్ ఇన్‌చార్జి, మాజీ ఎంపీపీ మేడిశెట్టి శ్రీధర్ పిలుపునిచ్చారు. మండలంలోని వీరన్నపేటలో శుక్రవారం జరిగిన స్థానిక సంస్థల సన్నాహక సమావేశంలో మేడిశెట్టి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చేర్యాల అభివృద్ధి కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టారన్నారు. దీంతోపాటు సొంత దవాఖానలో ఉచితంగా వైద్యం అందిస్తున్నారన్నారు. గ్రామాల్లో కేసీఆర్ అమలు చేసిన పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను గడపగడపకూ ప్రచారం చేయాలని, కాంగ్రెస్ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన 420 హామీలు, 6 గ్యారంటీలను అమలుచేయని విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిలు విజయం సాధించడం ఖాయమని, అయినా గెలుపు కోసం ప్రతి కార్యకర్త ఐకమత్యంతో కృషి చేయాలన్నారు. అక్రమంగా కేసులు నమోదు చేసినా, ఇబ్బందులకు గురిచేసినా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకురావాలని సూచించారు. కాంగ్రెస్‌కు అధికారం ఇవ్వడం వల్ల తెలంగాణ పరువు గంగలో కలిసిపోయిందని, హైడ్రాను తీసుకువచ్చి హైదరాబాద్‌కు అంతర్జాతీయ స్థాయిలో ఉన్న గుర్తింపును మూసీలో కలిసివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలనలో రియల్ ఎస్టేట్ రంగం పరుగులు పెట్టిందన్నారు. రూ.30 లక్షలకు ఎకరం ఉన్న పొలం ఇప్పుడు రూ. 18లక్షలు అమ్ముతామన్నా కొనే నాథుడే లేడని తెలిపారు. కేసీఆర్ పాలనలో రైతులకు మనోధైర్యం ఉండేదన్నారు. సమావేశంలో క్లస్టర్ ఇన్‌చార్జి సభ్యుడు, మాజీ కౌన్సిలర్ మంగోలు చంటి, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు అరిగే కనకయ్య, మాజీ ఎంపీటీసీలు ఎలికట్టె శివశంకర్ గౌడ్, పెద్దింటి ప్రసాద్, మాజీ సర్పంచ్ ఆరెళ్ల దేవేందర్ గౌడ్, బొందుగుల సత్యనారాయణ గౌడ్, పైస లింగం, మొగుల్ల సత్తిరెడ్డి, ఎలుసాని యాదగిరి, బింగి శ్రీశైలం, మహిళా అధ్యక్షురాలు వసంత, పుల్ల వీరయ్య, పెద్దింటి హరీశ్, పాకల శ్రీకాంత్, ఆరిగే కిషన్, కనకయ్య, సోషల్ మీడియా మండల ఇన్‌చార్జి బంగారి గల్ల కిరణ్‌కుమార్, గ్రామ ముఖ్య నాయకులు, బీఆర్ఎస్ అభిమానులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

మద్దూరు(ధూళిమిట్ట), ఫిబ్రవరి 7: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ శ్రేణులు కష్టపడి పనిచేయాలని బీఆర్ఎస్ మద్దూరు మండల అధ్యక్షుడు మేక సంతోశ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని లద్నూర్‌లో బీఆర్ఎస్ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంతోశ్‌కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ఎంపీపీ మలిపెద్ది సుమలతామల్లేశం, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ ఇర్రి రాజిరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి ముస్త్యాల నాగేశ్వర్‌రావు, బురగోని తిరుపతిగౌడ్, బీరెడ్డి ఇన్నారెడ్డి, బుడిగ శ్రీనుగౌడ్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు నంద శ్రీనివాస్, మాజీ సర్పంచ్ జీడికంటి సుదర్శన్, కొమురవెల్లి ఆలయ మాజీ డైరెక్టర్ కనకరాజు, మాజీ ఉపసర్పంచ్ బెడద కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయం

కొమురవెల్లి, ఫిబ్రవరి 7: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని బీఆర్ఎస్ క్లస్టర్ ఇన్‌చార్జి ముస్త్యాల బాలనర్సయ్య, అంకుగారి శ్రీధర్‌రెడ్డి అన్నారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం మండలంలోని మర్రిముచ్చాల, గురువన్నపేట, రసూలాబాద్‌లో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గీస భిక్షపతి ఆధ్వర్యంలో స్థానిక సంస్థల సన్నాహక సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..అతి తక్కువ కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. ఇప్పటివరకు కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేయాలేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలతో పాటు నెరవేర్చని హామీలను ప్రజలకు వివరించాలన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయని కాంగ్రెస్‌కు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తలారి కిషన్, బుడిగె గురువయ్య గౌడ్, పచ్చిమడ్ల స్వామి, పుర్మ వెంకట్‌రెడ్డి, శివగారి అంజయ్య, పచ్చిమడ్ల సిద్దిరాములు, వంగ రాణి, తాడెం రంజితాకృష్ణమూర్తి, పచ్చిమడ్ల మానస, సోషల్ మీడియా మండల కన్వీనర్ రమేశ్ గౌడ్ ఉన్నారు.

కొమురవెల్లి: గురువన్నపేటలో మాట్లాడుతున్న శ్రీధర్‌రెడ్డి

చేతిరాతపై విద్యార్థులకు శిక్షణ

చేతిరాత పుస్తకాలతో పొన్నాల ప్రాథమిక పాఠశాల విద్యార్థులు

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 7: మండల పరిధిలోని పొన్నాల ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు అందమైన చేతిరాతపై చేతిరాత నిపుణుడు ఎజాజ్ అహ్మద్ శిక్షణ అందించారు. పొన్నాల గ్రామానికి చెందిన దారబోయిన సంపత్‌యాదవ్, పెండ్యాల శ్రీనివాస్‌రెడ్డి ఒక్కో విద్యార్థికి రూ.150 చొప్పున మొత్తం రూ.15 వేలు విలువ గల చేతిరాత పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. చదవడం ఎంత ముఖ్యమో తప్పులు లేకుండా గుండ్రంగా, అందంగా రాయడం కూడా అంతే ముఖ్యమన్నారు. విద్యార్థులకు చేతిరాత పుస్తకాలు అందించిన దాతలకు, చేతిరాతపై శిక్షణ ఇచ్చిన ఎజాజ్ అహ్మద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేణుగోపాల్‌చారి, సౌజన్యసుధా, శ్రీవిద్య, జి.స్వప్న, ఆర్.స్వప్న, శిరీష పాల్గొన్నారు.

విద్యాశాఖకు మంత్రిని నియమించాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మద్దూరు(ధూళిమిట్ట), ఫిబ్రవరి 7: విద్యాశాఖకు వెంటనే మంత్రిని నియమించాలని ఎస్ఎఫ్ఐ చేర్యాల డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు మైసంపల్లి రాహుల్, తాడూరి భరత్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం మద్దూరు మండల కేంద్రంలో ఈనెల 20,21 తేదీల్లో జరగనున్న జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ మద్దూరు మండల కమిటీ, యూనిట్ కమిటీలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పట్టించుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా విద్యారంగంలో సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అభిలాష్, రోహిత్, శ్రీకాంత్, అశ్విత, మహేశ్వరి, మీనాక్షి, మానస తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు ట్రైనింగ్

కిష్టంపేటలో శిక్షణలో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు

కొమురవెల్లి, ఫిబ్రవరి 7: రిలయన్స్ ఆర్గనైజేషన్, వైల్డ్ రైట్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని కిష్టంపేటలో అన్ని గ్రామాల అంగన్‌వాడీ టీచర్లకు పూర్వ ప్రాథమిక విద్యలో భాగంగా ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సీడీపీవో రమాదేవి, చైల్డ్ రైట్స్ ఆర్గనైజేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ సుప్రజ, సీఆర్‌పీలు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో ఇంటి పన్ను చెల్లించాలి

దుబ్బాక, ఫిబ్రవరి 7: దుబ్బాక మున్సిపల్ పరిధిలోని ప్రజలు సకాలంలో ఇంటి పన్ను చెల్లించి, అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. శుక్రవారం 13, 14, 18 వార్డుల్లో మున్సిపల్ సిబ్బందితో కలిసి కమిషనర్ ఇంటి పన్ను వసూలులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 2024-25 ఆర్థిక సంవత్సరానికి పెండింగ్‌లో ఉన్న ఇంటి పన్ను, నల్లా బిల్లులతోపాటు వ్యాపారులు ట్రేడ్ లైసెన్సులు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.2 కోట్లకు ఇప్పటివరకు రూ.1.10 కోట్లు వసూలు అయ్యాయని తెలిపారు. నెల రోజుల్లో మిగిలిన రూ.90 లక్షలు వసూలు చేస్తామన్నారు. ఎర్లీబర్డ్ పథకం కింద ఇంటి పన్నులను ముందస్తుగా చెల్లిస్తే 5శాతం రాయితీ లభిస్తుందని, దీనిని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

తీన్మార్ నోరు జాగ్రత్త

- సిద్దిపేటలో దిష్టిబొమ్మ దహనం

శవయాత్ర నిర్వహిస్తున్న రెడ్డి సంఘం నేతలు

సిద్దిపేట, ఫిబ్రవరి 7: తీన్మార్.. నోరు జాగ్రత్త అంటూ రెడ్డి సంఘం నాయకులు హెచ్చరించారు. రెడ్డిలను ఉద్దేశించి ఇటీవల తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలపై పట్టణంలోని 15వ వార్డు ఇమాంబాద్‌లో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సిరిసిల్ల-సిద్దిపేట రోడ్డు వరకు శవయాత్ర నిర్వహించి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..అందరితో కలిపిడిగా ఉండే రెడ్డిలను తీన్మార్ మల్లన్న తన స్వార్థం కోసం ఇష్టారీతిన మాట్లాడడం సరికాదన్నారు. బడుగు, బలహీన వర్గాల ఐక్యతను ఏనాడూ రెడ్డిలు అడ్డుకోబోరన్నారు. మల్లన్న మరోసారి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే ఊరుకోబోమన్నారు. సీఎం రేవంత్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎమ్మెల్సీగా కొనసాగుతూ రెడ్డిలపై హేళనగా మాట్లాడడం అత్యంత శోచనీయమన్నారు. వెంటనే రేవంత్‌రెడ్డి సర్కారు స్పందించి చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో పోరాటాలకు సిద్ధం కావాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం అధ్యక్షులు పప్పుల కరుణాకర్‌రెడ్డి, ప్రతినిధులు పాతూరి శ్రీనివాస్‌రెడ్డి, నరసింహారెడ్డి, కృష్ణపల్లి నరసింహారెడ్డి, సుద్దాల సుదర్శన్‌రెడ్డి, కాశిరెడ్డి నాగరాజురెడ్డి, రాజిరెడ్డి, దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

కులవివక్ష కొనసాగడం అమానుషం

- ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 7: స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లు అవుతున్నా ఇంకా కుల వివక్ష కొనసాగడం అమానుషమని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. శుక్రవారం సిద్దిపేటలోని టీటీసీ భవన్‌లో సామాజిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో డా.బీఆర్ అంబేద్కర్ సతీమణి రమాబాయి 127వ జయంతిని నిర్వహించారు. బక్కి వెంకటయ్య రమాబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ..రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 ఏండ్లు అవుతున్నా.. నేటికీ దేశంలో కుల దురహంకార హత్యలు జరగడం క్షమించరానిదన్నారు. నగరంలో దళితులకు ఇంటి అద్దె ఇవ్వకుండా ఇప్పటికీ కుల వివక్ష పాటిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రజాసంఘాల నాయకులు, సామాజికవేత్తలు, జర్నలిస్టులు, గాయకులు పాల్గొన్నారు.

రమాబాయి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న బక్కి వెంకటయ్య, ఇతర నాయకులు

పన్నులు చెల్లించి సహకరించాలి

సిద్దిపేట, ఫిబ్రవరి 7: పట్టణ ప్రజలు పనులు సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి తోడ్పడాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ అన్నారు. శుక్రవారం కమిషనర్ మాట్లాడుతూ.. పట్టణంలో నిర్మాణాలు పూర్తయిన ప్రతి భవనానికీ ఇంటి నెంబర్ జారీ చేసి తప్పనిసరిగా పన్నులు వసూలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కమర్షియల్ భవనాల యజమానులు పదిరోజుల్లోగా మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించి పన్నులు చెల్లించాలన్నారు. లేకపోతే యజమానులపై చర్యలు తీసుకుంటామన్నారు. మార్చి 31 వరకు 100శాతం పన్నులు వసూలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. నల్లా బిల్లులు, ట్రేడ్ లైసెన్సులు సకాలంలో చెల్లించాలని ఆశ్రిత్ కుమార్ కోరారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

అంగడికిష్టాపూర్‌లో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న నవీన్‌రావు, రాజేశ్వర్‌రావు

గజ్వేల్, ఫిబ్రవరి 7: ప్రభుత్వ పాఠశాలల్లోని అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని కష్టపడి చదవాలని జయన్ వేర్ హౌస్ చైర్మన్ కళ్లపు నవీన్‌రావు, చెప్యాల రాజేశ్వర్‌రావు అన్నారు. గజ్వేల్ మండలం అక్కారం, మర్కుక్ మండలం అంగడికిష్టాపూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తల్లిదండ్రుల కళలను నిజం చేయాలని, అందుకు ప్రతి విద్యార్థి పోటీతత్వంలో చదివితే తప్పకుండా అనుకున్న గమ్యానికి చేరుతారన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గ్రామీణ ప్రాంత వాతావరణంపై పట్టు ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాల చంద్రం, రాములుగౌడ్, ఎస్ఎంసీ చైర్మన్లు చంద్రం, కనకయ్య పాల్గొన్నారు.

వైద్యసేవలు అందుబాటులోకి తీసుకురావాలి

హుస్నాబాద్, ఫిబ్రవరి 7: హుస్నాబాద్‌లో రూ.7 కోట్లతో నిర్మించిన మాతా శిశు సంరక్షణ దవాఖానను తక్షణమే ప్రారంభించి, వైద్యసేవలు అందుబాటులోకి తీసుకురావాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్, ఆ పార్టీ నాయకులు శుక్రవారం దవాఖాన ఎదుట విలేకరులతో మాట్లాడారు. దవాఖాన ప్రారంభమైతే అక్కన్నపేట, హుస్నాబాద్, కోహెడ, చిగురుమామిడి మండలాల్లోని గర్భిణులు, పిల్లలకు వైద్యసేవలు అందుబాటులో ఉంటాయన్నారు. లేదంటే కరీంనగర్, వరంగల్, హైదరాబాద్‌కు వెళ్లాల్సి వస్తుందన్నారు. దవాఖానలో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేసి ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో ఎనగందుల శంకర్, డేగల వెంకటేశ్, రాజు ఉన్నారు.

బంధం చెరువులో బర్రెలు మృతి

- ఆరు రోజులైనా చర్యలు చేపట్టని అధికారులు

బర్రెల మృతదేహాలను చూస్తున్న రైతులు

వర్గల్, ఫిబ్రవరి 7: సాగునీటి అధికారుల అజాగ్రత్త ఓ రైతును నిండా ముంచింది. ఎలాంటి హెచ్చరిక జారీ చేయకుండా కాలువలోకి నీళ్లు వదలడంతో నీటి ప్రవాహానికి నాలుగు బర్రెలు కొట్టుకుపోయాయి. అందులో ఒక బర్రెను అతికష్టం మీద కాపాడారు. మిగితా మూడు బర్రెలు నీటి ప్రవాహానికి చౌదర్‌పల్లి బంధం చెరువులోకి కొట్టుకుపోయి ఊపిరాడక చనిపోయాయి. మండలంలోని అవుసులోనిపల్లికి చెందిన రైతు మోతె శివరాజ్ తన బర్రెలను గ్రామ శివారులో మేత కోసం తీసుకెళ్లాడు. అధికారులు సంగారెడ్డి లిప్ట్ కెనాల్‌కు నీటిని వదలడంతో బర్రెలు కాలువలో కొట్టుకుపోయాయి. శివరాజ్ కేకలు వేయడంతో రైతులందరూ అతికష్టం ఒకదానిని కాపాడారు. బర్రెల జాడ కోసం వెతకగా.. మూడు రోజుల తర్వాత చెరువుకట్టకు దగ్గరలో బర్రె కళేబరాలు కనిపించాయి. దీంతో రైతు దుఃఖానికి అంతులేకుండా పోయింది. అధికారులకు సమాచారం ఇచ్చినా ఇప్పటివరకు చెరువు నుంచి బర్రెల కళేబరాలను బయటకు తీయలేదు. అధికారులు స్పందించి బర్రెల కళేబరాలను బయటకు తీసి బాధిత రైతుకు నష్టపరిహారం అందించాలని వర్గల్ మాజీ ఉపసర్పంచ్ రమేశ్, నాయకులు మల్లారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

శివాజీ విగ్రహం ఆవిష్కరణ